## ముగిసిన జిల్లాస్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభించి నిర్వహణను పరిశీలిస్తున్న డీఈవో, డీవైఎస్‌వోలు

కొత్తపల్లి, జూన్ 27 : రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం జిల్లాస్థాయి ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, డీవైఎస్‌వో బీ శ్రీకాంత్‌రెడ్డి, డీపీవో రవీందర్ ప్రారంభించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన సుమారు 80 మంది విద్యార్థులను జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఏడు ఈవెంట్‌లలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను జూలై 8 నుంచి 12 వరకు హాకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు డీవైఎస్‌వో పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, కోచ్ ఇందిరా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వర్షపు నీటితో ఇబ్బందులు రాకుండా చూడాలి

- నగర ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కార్పొరేషన్, జూన్ 27: నగరంలోని ముకరంపుర మంకమ్మతోట ప్రాంతాల్లో వర్షం నీటి వల్ల ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర ఇన్‌చార్జి కమిషనర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని ముకరంపుర ప్రాంతంలోని మురుగు కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలోని ప్రధాన మురుగు కాలువలో పేరుకపోయిన సిల్ట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. వరద నీరు మురుగు కాలువల ద్వారా సులువుగా వెళ్లేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా వరద నీటి సమస్య ఉంటే అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జితేందర్, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమం

విద్యానగర్, జూన్ 27: శ్రీనిధి చిట్స్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జీవీ హబ్ ఫౌండేషన్, శ్రీ సేవ మార్గ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం జ్యోతి నగర్‌లో మహిళా వ్యాపారవేత్తలకు కొత్త వ్యాపారం ప్రారంభించిన మహిళలకు అవగాహన కార్యక్రమం, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్స్ 320 జిల్లా గవర్నర్ హనుమాన్ల రాజిరెడ్డి హాజరై మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని మహిళలను వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రోగ్రాం ఆర్గనైజర్ మునిపల్లి అనిత మాట్లాడుతూ, చాలా మంది మహిళలు ప్రభుత్వం ఇచ్చే లోన్లు ఎలా తీసుకోవాలో తెలుసుకోలేకపోతున్నారని, అలాంటి వారికి వీహబ్ టీం అన్ని విధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్సింగ్ టీం సురేశ్ స్వాతి, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో నాయకుల ఔదార్యం



నరేశ్‌కు చికిత్స కోసం డబ్బులు అందజేస్తున్న టీఎన్జీవో నాయకులు

కొత్తపల్లి, జూన్ 27 : రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు గాయపడి వైద్య చికిత్స పొందుతున్న ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుకు టీఎన్జీవో నాయకులు రూ.14,500 విరాళంగా అందించి మరోసారి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఓ చానల్‌లో వీడియో జర్నలిస్టుగా పనిచేస్తున్న నరేశ్ ఇరవై రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్య చికిత్స కోసం కుటుంబం పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించిన టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, ఇతర సభ్యులు, ఉద్యోగులు విరాళంగా సేకరించి రూ 10వేలను ఆర్థిక సాయంగా అందించారు. మరోసారి నరేశ్‌కు వైద్య చికిత్స కోసం టీఎన్జీవోల విజ్ఞప్తి మేరకు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం, డ్రైవర్ల సంఘం, ఉద్యోగులు అందరూ కలిసి రూ 14,500 వేలు సేకరించి గురువారం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నరేశ్‌కు అందించారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు సర్దార్ హర్మేందర్‌సింగ్, మారుపాక రాజేశ్ భరద్వాజ్, కోట రామస్వామి, నరసింహారెడ్డి, అరసవెల్లి రాజేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వల్లంపహాడ్‌లో రోడ్డు నిర్మాణంపై ఆందోళన

కరీంనగర్ రూరల్, జూన్ 27: వల్లంపహాడ్‌లోని రోడ్డు నిర్మాణం విషయమై స్థానికులు అధికారుల ఎదుట ఆందోళనకు దిగారు. వల్లంపహాడ్ గ్రామానికి పంచాయతీ రాజ్ నిధులతో కొన్నేండ్ల క్రితం బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టగా, తమ పట్టాభూముల నుంచి రోడ్డు వేస్తున్నారంటూ కొందరు రైతులు కోర్టులో కేసు వేసి స్టేఆర్డర్ తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఇటీవల స్థానికులు కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని వినతిపత్రం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆర్ఐ రజినీకాంత్, సర్వేయర్ సంతోష్ తదితరులు రోడ్డు నిర్మాణం నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామనక్షాలో ఉన్న ప్రకారం రోడ్డు నిర్మించాలని కొందరు వ్యక్తులు డిమాండ్ చేయగా, తమ పట్టాభూముల నుంచి రోడ్డు నిర్మాణం చేయవద్దంటూ మరికొందరు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది, చివరకు నక్షా ప్రకారం రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేస్తామని ఆర్ఐ, ఇరువర్గాలకు నచ్చ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి, రోడ్డుకు అవసరమైన స్థలాన్ని గుర్తించి హద్దులను ఏర్పాటు చేస్తామని ఆర్ఐ రజినీకాంత్ తెలిపారు.

## వృద్ధురాలి దైన్యస్థితిపై విచారణ

కొత్తపల్లి, జూన్ 27 : తాను కన్నవారు కనికరం చూపడం లేదని, ఇంటి మెట్ల కింద తలదాచుకుంటూ తనకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు మొర పెట్టుకున్న వృద్ధురాలి దైన్యస్థితిపై జిల్లా సంక్షేమ శాఖ అధికారులు విచారణ జరిపినట్లు ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి ఆదేశాలతో వృద్ధురాలు పెద్ది రుక్కవ్వ నివసిస్తున్న బావుపేట గ్రామానికి వెళ్లి, ఇరుగుపొరుగును కూడా విచారించినట్లు పేర్కొన్నారు. ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు మరణించగా, పెద్దకుమారుడు బాగోగులు చూసుకోగా, ప్రస్తుతం తనను పట్టించుకోవడం లేదని వాంగ్మూలం ఇచ్చినట్లు వెల్లడించారు. దీనిపై నివేదిక సిద్ధం చేసి జిల్లా సంక్షేమాధికారికి అందజేయనున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## ప్రమాదవశాత్తు వ్యాన్‌పై నుంచి పడి హమాలీ మృతి

మానకొండూర్ రూరల్, జూన్ 27: డీసీఎం వ్యాన్‌లో నుంచి ఎరువు బస్తాలు దింపుతుండగా ప్రమాదవశాత్తుగా కాలు జారి వాహనం పైనుంచి పడిన ఘటనలో హమాలీ మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చుక్క రాజయ్య (48) ఊటూర్ సొసైటీకి చెందిన లక్ష్మీపూర్‌లోని గోదాంలో బుధవారం ఎరువు బస్తాలను దింపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారిపడ్డాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య మంగమ్మ, కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

***సొసైటీ ఎదుట ఆందోళన***

పోస్టుమార్టం పూర్తి చేసుకొని గురువారం ఉదయమే లక్ష్మీపూర్‌కు హమాలీ చుక్క రాజయ్య మృతదేహాన్ని తీసుకురాగా, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు సొసైటీ ఎదుట ఆందోళన చేపట్టారు. సొసైటీ పాలకవర్గం అత్యవసర సమావేశాన్ని నిర్వహించి, మృతుడి కుటుంబానికి రూ. 2లక్షల ఆర్థిక సాయంతో పాటు కుటుంబ సభ్యుడికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. సొసైటీ తరపున అంత్యక్రియల కోసం రూ. 10 వేలు అందజేయగా, దహన సంస్కారాలు నిర్వహించారు.

# నూతన చట్టాల అమలుకు సంసిద్ధంగా ఉండాలి

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

రాంనగర్, జూన్ 27 : దేశవ్యాప్తంగా జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలను అమలు చేసేందుకు అధికారులు అందరూ సంసిద్ధంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి సూచించారు. గురువారం నూతన చట్టాలపై రాష్ట్ర డీజీపీ రవి గుప్తా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ అభిషేక్ మొహంతి అనంతరం పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో నూతన చట్టాల అమలుపై పలు కీలక అంశాలను చర్చించారు. ఐపీసీ1860కి బదులుగా భారతీయ న్యాయ సంహిత 2023, సీఆర్‌పీసీ 1973 బదులుగా భారతీయ నాగరిక్ సురక్షసంహిత 2023, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 బదులుగా భారతీయ సాక్ష్య అధినియం 2023 అమల్లోకి రానున్నాయని రాష్ట్ర డీజీపీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం పోలీస్ కమిషనర్ కమిషనరేట్ పోలీసు అధికారులతో పలు అంశాలపై చర్చించారు. జూలై నుంచి జరుగబోయే నేరాలకు మారిన చట్టాలకు అనుగుణంగా కేసులు నమోదు చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు బాధ్యతతో విధిగా నూతన చట్టాలను అమలు చేయాలన్నారు. నూతన చట్టాలపై ఏర్పడే సందేహాలను నివృత్తి చేసుకుంటూ సరైన సెక్షన్లను ప్రయోగించాలన్నారు. నేరస్తులు తప్పించుకునేందుకు వీలు లేకుండా, బాధితులకు న్యాయం జరిగేలా పకడ్బందీగా నూతన చట్టాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీలు శ్రీనివాస్, నరేందర్, శ్రీనివాస్, విజయకుమార్, కాశయ్యతో పాటు జిల్లాలోని అన్ని విభాగాల ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ వెల్ఫేర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో 'హౌస్ ఎలక్షన్స్'



ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూన్ 27 : నగరంలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ ప్రాంగణంలో గురువారం పాఠశాల హౌస్ ఎన్నికలు సాధారణ ఎన్నికల నియమావళి ప్రకారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికల వాతావరణం తలపించేలా పాఠశాలలో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రం, ఓటింగ్ యంత్రం ఏర్పాటు చేశారు. సిబ్బంది పోలింగ్ ఆఫీసర్, రిటర్నింగ్ ఆఫీసర్స్‌గా వ్యవహరించారు. పాఠశాలలోని తేజస్, సరస్, ధృవ, లక్ష్య విభాగాలకు ఎన్నికలు జరుగగా, విద్యార్థులు వరుస క్రమంలో వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంతో కీలకమన్నారు. ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాల హౌస్ ఎన్నికలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పార్లమెంట్ ముట్టడిలో జిల్లా కాంగ్రెస్ నాయకులు



పార్లమెంట్ ముట్టడిలో పాల్గొన్న జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు

రాంనగర్, జూన్ 27 : నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు తిరిగి పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం యువజన కాంగ్రెస్ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం చేపట్టగా, ఇందులో జిల్లా చెందిన నాయకులు భారీగా పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ నేతృత్వంలో జాతీయ యువజన కాంగ్రెస్ కార్యాలయం నుంచి పాదయాత్రగా వెళ్లి పార్లమెంట్ ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఈ నిరసనలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శులు శ్యామ్ సుందర్‌రెడ్డి, పొన్నం మధు, కరీంనగర్ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కిమ్ ఫహద్, తొర్తి అరవింద్, జిల్లా అధికార ప్రతినిధులు ఎండీ అజీమ్, గట్టు ప్రశాంత్ గౌడ్ , యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు సజ్జు, అన్సారీ అలీ, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ దాసారపు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న జ్యోతిష్మతి కళాశాలల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు

తిమ్మాపూర్ రూరల్, జూన్ 27 : మండలంలోని రామకృష్ణ కాలనీ, సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జ్యోతిష్మతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో చైర్మన్ జువ్వాడి సాగర్ రావు నోట్‌బుక్స్ వితరణ చేశారు. మొత్తం 250 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 12 నోట్ బుక్స్ సమకూర్చగా, గురువారం ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో తిమ్మాపూర్ తహసీల్దార్ కనకయ్య నోట్స్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతిష్మతి కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం నోట్‌బుక్స్ అందిస్తున్నామని గుర్తు చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కురం లక్ష్మి, నాయకులు గుజ్జుల రవీందర్ రెడ్డి, మీసాల అంజయ్య, గుజ్జుల ప్రణీత్ రెడ్డి, దావ సంపత్ రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

## నర్సరీలను పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ

కరీంనగర్ రూరల్, జూన్ 27: మండలంలోని గోపాల్‌పూర్, బొమ్మకల్ గ్రామాల నర్సరీలను గురువారం డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ పరిశీలించారు. గ్రామాల్లో, రోడ్ల వెంబడి నాటిన మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఏడు రకాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఏపీవో శోభ, ఉపాధిహామీ టెక్నిషియన్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



బొమ్మకల్ నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ తదితరులు

# కారు ఢీకొని స్కూల్ వ్యాన్ బోల్తా

- 30మంది స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు
- కారులో ప్రయాణిస్తున్న ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- బాధితులది కరీంనగర్ జిల్లా



కమలాపూర్ శివారులో ఏకశిల స్కూల్ వ్యాన్‌ను ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

కమలాపూర్, జూన్ 27 : కారు ఢీకొని ప్రైవేట్ స్కూల్ వ్యాన్ బోల్తాపడగా, అందులో ఉన్న 30 మంది పిల్లలకు ప్రాణాపాయం తప్పి ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, అందులో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపురం మండల కేంద్రం శివారు ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్ వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలంలోని ఏకశిల స్కూల్ వ్యాన్ పిల్లలను తీసుకుని గ్రామాల్లో దింపేందుకు వస్తున్నది. కన్నూరు, రాములపల్లి, భీంపల్లి గ్రామాల విద్యార్థులను దింపేందుకు హెచ్‌పీ పెట్రోల్ పంపు దాటిన తర్వాత డ్రైవర్ రత్నం యూటర్న్ తీసుకుంటుండగా పరకాల నుంచి హుజురాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఢీకొట్టగా స్కూల్ వ్యాన్ బోల్తాపడింది. అందులోని 30మంది పిల్లలు భయాందోళనతో కేకలు వేయడంతో రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు వ్యాను అద్దాలు పగులగొట్టి బయటకు తీశారు. రాములపల్లికి చెందిన బిల్ల అక్షయతో పాటు మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న హుజూరాబాద్ మండలం కందుగులకు చెందిన అబ్దుల్, కరీంనగర్ సీతారాంపూర్‌కు చెందిన కొట్టె సంతోష్, హుజూరాబాద్‌కు చెందిన భవానందస్వామికి తీవ్ర గాయాలు కాగా, వారిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అబ్దుల్ మృతి చెందగా, సంతోష్ పరిస్థితి విషమంగా ఉంది. సీఐ హరికృష్ణ, ఎస్ఐ వీరభద్రరావు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన పిల్లలను పోలీసు వాహనంలో దవాఖానకు తరలించారు.

## 'వీసీపై చర్యలు తీసుకోవాలి'

తెలంగాణచౌక్, జూన్ 27: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలపై నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ నాయకులను సస్పెండ్ చేసిన యూనివర్సిటీ వీసీపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ చౌక్‌లో వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపడం విద్యార్థులకు రాజ్యాంగ హక్కన్నారు. విద్యార్థుల సస్పెన్షన్, వారికి విధించిన జరిమానా ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వినయ్, సాగర్, తరుణ్, మనోహర్, సాయి పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

ఇల్లందకుంట, జూన్ 27: రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని హుజూరాబాద్ ఏడీఏ సునీత ఆయా దుకాణాల నిర్వాహకులకు సూచించారు. గురువారం ఇల్లందకుంట, సిరిసేడు బుజునూర్, సీతంపేట గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు రైతులకు విక్రయించినప్పుడు రికార్డుల్లో తప్పక నమోదు చేయాలన్నారు. ఈ సీజన్‌కు సరిపడా ఎరువులు అన్ని షాపుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# అధికారుల నిర్లక్ష్యం.. రైతు కుటుంబానికి శాపం

- కొత్తగట్టు వద్ద కల్వర్టు వరద నీటితో కూలిన వ్యవసాయ బావి
- పూడుకుపోయిన మోటర్లు, పైపులు
- సాగునీరు లేక ఎండుతున్న 6.5 ఎకరాల పొలం
- లబోదిబోమంటున్న రైతు కుటుంబం
- ఫిర్యాదు చేసినా స్పందించని ఆర్డీవో కార్యాలయం



కల్వర్టు నుంచి నేరుగా వ్యవసాయ బావిలోకి వస్తున్న పెద్దగట్టు గుట్ట వరద

శంకరపట్నం, జూన్ 27: ఎన్‌హెచ్ఏఐ అధికారుల నిర్లక్ష్యం ఓ రైతు కుటుంబానికి శాపంగా పరిణమించింది. వ్యవసాయ బావికి ఎదురుగా నిర్మించిన కల్వర్టు వరదతో వ్యవసాయ బావి కూలి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లడమే గాక 6.5 ఎకరాల్లో వేసిన వరి నాటు ఎండిపోతుండడంతో ఆ రైతు కుటుంబం దిక్కుతోచక దీనంగా చూస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తగట్టు గ్రామానికి చెందిన నీలం రాజయ్య, నీలం నాగయ్య, నీలం కనకయ్య, నీలం రాజ్‌కుమార్, నీలం సారయ్య అనే ఐదుగురు అన్నదమ్ములు. వారికి ఊరి శివారులోని సాయికుంట వద్ద రహదారిని ఆనుకుని 231 సర్వే నంబర్‌లో 8.5 ఎకరాల వ్యవసాయం పొలం ఉంది. ప్రస్తుతం జాతీయ రహదారి ఎన్‌హెచ్-563 ఫోర్ లేన్ విస్తరణతో ఈ రైతు సోదరులకు చెందిన రెండు ఎకరాల గుండా రోడ్డు పోతున్నది. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ. 2 కోట్లు పలుకుతుండగా, అధికారులు అరకొరగా రూ. 56 లక్షలు చెల్లించారు. ఇది ఇలా ఉండగా రోడ్డుకు మరోవైపు పెద్దగట్టు గుట్ట ఉంది. ఈ గుట్ట నుంచి వచ్చే వరద వెళ్లేందుకు అధికారులు ఓ కల్వర్టు నిర్మించారు. ఇది సరిగ్గా వీరి వ్యవసాయ బావికి ఎదురుగా ఉంది. ఈ నెల 19 నుంచి కురుస్తున్న వర్షాలకు గుట్ట నుంచి వచ్చే వరద పోటెత్తి ఎదురుగా ఉన్న రైతు కుటుంబానికి చెందిన బావిలోకి వెళ్తున్నది. దీంతో 22 గజాల లోతు గల ఈ వ్యవసాయ బావి ఇప్పటికే సగానికి పైగా కూలింది. రూ.1.5 లక్షల విలువ చేసే రెండు 7 హెచ్‌పీ కరెంటు మోటర్లు, పైపులు, వైర్లు, బెల్ట్‌లు అందులోనే కూరుకుపోయాయి. వెంటనే ఆ రైతు సోదరులు ఈ నెల 22న తమకు పరిహారం అందించి తగిన న్యాయం చేయాలని హుజూరాబాద్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. మరో పక్క మిగిలిన 6.5 ఎకరాల్లో అప్పులు తెచ్చి వేసిన నాటు నీళ్లు లేక ఎండిపోతుండడంతో తల్లడిల్లుతున్నారు. ఓ పక్క రూ. లక్షల విలువ చేసే బావి రోజు రోజుకూ కూరుకుపోతుండగా, తమకు న్యాయం చేసే వారి కోసం దీనంగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి ఆ రైతు సోదరులకు తగిన పరిహారం చెల్లించి, భవిష్యత్తులో వరద నీటిని గతంలో లాగా సాయికుంటలోకి మళ్లించేలా కల్వర్టు డిజైన్‌ను మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



వరద మట్టితో కూరుకుపోయిన వ్యవసాయ బావి



కేసీఆర్‌తో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహిపాల్‌రావు, కుటుంబ సభ్యులు

## కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు

గంగాధర, జూన్ 26: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గంగాధర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బూరుగుపల్లి మాజీ సర్పంచ్ సాగి రమ్య కుటుంబ సభ్యులతో బుధవారం ఎర్రవల్లిలోని ఆయన ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సత్యంకు రసమయి పరామర్శ



మేడిపల్లి సత్యంను పరామర్శిస్తున్న రసమయి బాలకిషన్

తిమ్మాపూర్, జూన్ 27 : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఇటీవల మరణించగా, గురువారం మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అల్వాల్‌లోని సత్యం నివాసంలో ఆయనను కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. వారి పిల్లలను దగ్గరకు తీసుకొని ధైర్యం చెప్పారు.

## బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

సైదాపూర్, జూన్ 27: మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నర్సింగోజు నర్సయ్య బుధవారం మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులను గురువారం వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు గుండేటి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు, నర్సయ్య మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

## 'ఉపాధి' కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 27: గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉపాధి హామీ కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు పని చేసిన వారంలోనే కూలి డబ్బులు చెల్లించాలని గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కనీస వేతనం రోజుకు రూ 600కు, పనిదినాలు 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పేదలకు ఇండ్ల నిర్మాణం కోసం ఇస్తామని ప్రకటించిన ఐదు లక్షలు రూపాయలను అందించాలన్నారు. కౌలు రైతులను ఆదుకుంటామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు వారిని గుర్తించే కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. సకాలంలో రైతు బంధు డబ్బులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములు పేదలకు పంచకుంటే తామే ఆక్రమించుకొని పేదలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అజయ్, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

## మునీందర్‌కు 'స్ఫూర్తి' పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఎర్రంశెట్టి మునీందర్

కమాన్‌చౌరస్తా, జూన్ 27 : సాన్వి జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ విద్యావేత్త ఎర్రం శెట్టి మునీందర్ స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వసుంధర విజ్ఞాన వికాస మండలి -సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఆ సంస్థ 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు వైద్యుల మధుకర్ రెడ్డి తదితర ప్రముఖులు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు నెలకొల్పి విద్యారంగంలో విశేష కృషి చేస్తున్నందుకు ఎర్రం శెట్టి మునీందర్‌ను పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన విద్యావేత్తలు, విద్యాసంస్థల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

## పోషకాహారంతో పిల్లల ఎదుగుదల

శంకరపట్నం, జూన్ 27: పిల్లలకు అందించే పోషకాహారంపైనే వారి ఎదుగుదల ఆధారపడి ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో సబిత పేర్కొన్నారు. గ్రోత్ మానిటరింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె ఇప్పలపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారుల ఎత్తు, బరువులను స్వయంగా పరిశీలించారు. అలాగే అన్ని పోషక విలువలు ఉన్న పోషకాహారం అందించినప్పుడే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారని తల్లులు, టీచర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. కేంద్రం ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. ఇక్కడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, ఆయాలు పాల్గొన్నారు.

***పారువెల్లలో..***

గన్నేరువరం, జూన్ 27: మండలంలోని పారువెల్ల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రోత్ మానిటరింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇస్రాత్ సుల్తానియా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల బరువు, ఎత్తు వివరాలు నమోదు చేశారు. పోషకార ప్రాముఖ్యతను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రేమలత, ఆశ కార్యకర్త విజయలక్ష్మి, ఆయా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- తరలింపునకు సమయత్తం అవుతున్న అధికారులు

గంగాధర, జూన్ 27 : మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని మరో చోటకు తరలించడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. 40 ఏండ్ల క్రితం నిర్మించిన కార్యాలయ భవనం గోడలు బీటలువారడంతో పాటు వర్షాలకు పైకప్పు ఉరుస్తుండడంతో రికార్టులు తడిచిపోతున్నాయని ఎస్ఆర్‌వో పద్మ తెలిపారు. భవనానికి మరమ్మతులు చేయించినా ఫలితం లేదని, వైరింగ్ కూడా పోవడంతో తరచూ విద్యుత్ సమస్య కూడా వస్తున్నదని చెప్పార. సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి కార్యాలయాన్ని మరో చోటికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, రిజిస్ట్రార్ కార్యాలయం మరో చోటికి తరలిస్తే ఇబ్బందికరంగా ఉంటుందని, మండల కేంద్రంలోనే మరో చోట ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.



గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం